క్లుప్తంగా

మదనపల్లె నుంచి ఊటీకి ఆర్టీసీ సర్వీసు

రాయచోటి అర్బన్ : వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని మదనపల్లె నుంచి ఊటీ, కూనూరు, మెట్టుపాళెం ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసును నడుపనున్నట్లు మదనపల్లె – 2 డిపో మేనేజర్ ఆర్.సి.నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగస్తులకు అనుకూలంగా ఉండేలా ఈనెల 12వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు బస్సు బయలు దేరుతుందన్నారు. 13వ తేదీ తెల్లవారుజామున ఊటీకి చేరుకుంటున్నారు. అక్కడ నుంచి కూనూరు హిల్‌స్టేషన్, 14న మెట్టుపాళెంలో ఉండి అదే రోజు రాత్రి బయలుదేరి 15వ తేదీ తెల్లవారుజామున మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సులో 35 సీట్లు ఉంటాయని, ఒక్కొక్కరికి చార్జీ రూ.2250లు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా ఆర్.సి.ఓబులేసు



సిద్దవటం : సిద్దవటం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఆర్.సి.ఓబులేసు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీఓ ఫణిరాజకుమారికి జాయినింగ్ రిపోర్టును అందజేశారు. ఇక్కడ పెద్దపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరించారు. సింహాద్రిపురంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆర్.సి.ఓబులేసును డిప్యూటేషన్‌పై సిద్దవటానికి బదిలీ చేశారు.

మహాయజ్ఞంలో పాల్గొనండి

రాయచోటి టౌన్ : రాష్ట్ర దేవాదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత కుండాత్మక మహా యజ్ఞంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు పాల్గొనాలని అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ తెలియజేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లోక కల్యాణం కోసం ఈ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమం వలన రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండలానే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో యజ్ఞం జరుపుతున్నామన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రతి రోజూ హోమాలు, రోజుకొక దేవతామూర్తులకు కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ హోమాలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

12 నుంచి వీరాంజనేయుడి తిరునాల

సిద్దవటం : లింగంపల్లె గ్రామ శివారులో వెలసిన వీరాంజనేయస్వామి 22వ తిరునాల ఈనెల 12వ తేదీ నుంచి 14 తేదీ వరకు జరుపనున్నట్టు ఆలయ వ్యవస్థాపకుడు ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేయనున్నామన్నారు. 14వ తేదీన హనుమాన్ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 3. 00 గంటలకు న్యూకేటగిరి వృషభ రాజములచే బండలాడుగు పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి బహుమతి రూ. 40,116, రెండవ బహుమతి రూ. 25, 116, మూడవ బహుమతి రూ. 15,116 అందజేస్తామన్నారు.

వాహనాల రికార్డులు పక్కాగా ఉండాలి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న రాయచోటి రూరల్ సీఐ లింగప్ప

సంబేపల్లె : వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులను తప్పక ఉంచుకోవాలని రాయచోటి రూరల్ సీఐ లింగప్ప పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఎస్ఐ షరీఫ్, పోలీసులున్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

నిమ్మనపల్లె : పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వెంగంవారిపల్లె పంచాయతీ సైదాపేట సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3010లు సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెలవుల్లో విధుల నిర్వహణ సరికాదు

కడప ఎడ్యుకేషన్ : వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులను విధులు నిర్వహించమని విద్యాశాఖ అధికారులు పేర్కొనడం సరికాదని ఫ్యాప్టో జిల్లా చైర్మెన్ మాదవ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ విషయమై కడప డీఈఓకు వినతిపత్రం ఇచ్చారు.

హామీలను నెరవేర్చాం.. ఆదర్శంగా నిలిచాం

గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లక్కిరెడ్డిపల్లె: వృద్ధురాలికి అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి: డెయిరీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తదితరులు

లక్కిరెడ్డిపల్లె : ప్రజలు సుఖసంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని సోమల వాండ్లపల్లె, రాయపల్లె, హరిజనవాడ, తాటిమాకుల పల్లె, బాలేవాండ్లపల్లె, కుప్పం వాండ్లపల్లె, కొర్లకుంట వాండ్లపల్లె, పందిళ్లపల్లె కస్బాలలో గడప గడపకుకు కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాపత్తిన రెడ్డయ్యలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాంత్ రెడ్డి ఇంటింటా పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. గడప గడపనా శ్రీకాంత్ రెడ్డికి ఆత్మీయ స్వాగతాలు ప్రజలు పలికారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి జరుగుతోందన్నారు. పరిపాలనలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ పథకాలకు సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారన్నారు.

సోమలవాండ్లపల్లెలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నూతనంగా వేసిన బోరుకు మోటారును బిగించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. తాటిమాకులపల్లెలో అంగన్‌వాడీ కేంద్రాన్ని శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పౌష్టిక ఆహారంపై ఆరా తీశారు. కుప్పంవాండ్లపల్లెలో రూ. 8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలను చేపడతామని శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

పాలు రైతులకు మంచి రోజులు..

జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు భద్రత, ఆర్థిక భరోసా లభిస్తోందంటూ ఎమ్మెల్యే ఎదుట పాడి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేటు డైరీల అడ్డగోలు దోపిడీకి కళ్లెం పడిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో పాడి రైతులకు మంచి రోజులు తెచ్చిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీటీసీ ఎల్లమ్మ, సర్పంచ్ పి.సుబ్బమ్మ, తహసీల్దార్ నరసింహులు, ఈఓపీఆర్డీ డి.పట్నాయక్, ఉద్యానశాఖ అధికారి నాగమణి, ఎంఈఓ చక్రేనాయక్, హౌసింగ్ ఏఈ జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులపై..

అనంతపురం గంగమ్మ ఆలయంలో గాలిగోపురం, కోనేరు నిర్మాణ పనులు త్వరలో మొదలుపెట్టేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం అనంతపురం గంగమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందించి, దుశ్శాలువాతో ఎమ్మెల్యేను సత్కరించి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై శ్రీకాంత్‌రెడ్డి చర్చించారు.

ప్రజలందరిలో భక్తిభావాన్ని పెంపొందాలి

రామాపురం : ప్రజలందరిలో భక్తిభావాన్ని పెంపొందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాచపల్లె గ్రామంలోని కొవ్వూరివాండ్లపల్లెలో విశ్వనాథరెడ్డి కుమారుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 11 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టకు విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆయన చేత ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందించి సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, ముమ్మసాని రాజారెడ్డి, నాగసుబ్బారెడ్డి, చలమారెడ్డి, వెంకట్రామిరెడ్డి, అమృత నాయుడు, రాజేంద్ర, వెంకటరామరాజు, నాగార్జున, సర్వేశ్వర, హరి తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహం

రాయచోటి : పాడి పరిశ్రమ అభివృద్ధికి జగన్ ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గాలివీడు రింగ్ రోడ్డు (కడప బైపాస్ రహదారి)లో కర్నూలు మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో విజయపాల డెయిరీని యూనియన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు మిల్క్ యూనియన్ ఎండీ ప్రదీప్ కుమార్, డీడీ నాగరాజేష్, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్, ప్లాంట్ ఇన్‌చార్జ్ శ్రీనివాస కుమార్, ఫీల్డ్ ఇన్‌చార్జ్ బాల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడి సన్నిధిలో కొండూరు అజయ్‌రెడ్డి



పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి

పెనగలూరు : ఈటమాపురం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి 9 గంటలకు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అజయ్ రెడ్డితోపాటు ఆలయ చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ గుండాల్ రెడ్డి, ఆలయ అభివృద్ధి చైర్మన్ శంకర్ రెడ్డి, పెనగలూరు వైస్ ప్రెసిడెంట్ చిన్న గుండాల్ రెడ్డిలు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు దాదాపు 4 వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

104 ఉద్యోగుల వినతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 104 ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె. శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉమా మహేశ్వర్‌కు వినపతిపత్రమిచ్చారు.

సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి



సైన్స్ ప్రయోగాలు చేసి చూపుతున్న జేవీవీ సభ్యులు

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు మధుసూదన్‌రాజు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమంలో ఆయన విద్యార్థుల ఎదుట సైన్స్ ప్రయోగాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. రాకెట్ ప్రయోగాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ ప్రయోగానికి అగ్గిపుల్లలు, వాడిపడేసిన రీఫిల్ పెన్నును ఉపయోగించాడు. కిందకి నిప్పులు చిమ్ముతూ పైకి రీఫిల్ రాకెట్‌లా దూసుకుపోవడం విద్యార్థులలో ఉత్సాహాన్ని, ఆసక్తిని పెంపొందింపజేసింది. జపాన్‌లో రూపొందించిన బుల్లెట్ రైలు భౌతిక నియమాన్ని ప్రయోగం ద్వారా విద్యార్థులకు వివరించారు. ఘన, ద్రవ పదార్థాలలో విద్యుత్ ప్రసరణ అనే అంశానికి సంబంధించి ప్రయోగాలు చేసి అందులోని నియమాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఒరిగామి కళలకు సంబంధించి రాజశేఖర్ విద్యార్థులకు మెళుకువలు నేర్పించారు. ఈ కార్యక్రమాన్ని మే 17వ తేదీ వరకు విద్యార్థుల కోసం ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి రామయ్య, ఆంజనేయులు, రవీంద్రనాథరెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు సత్వరమే పూర్తి చేయండి



సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి

నందలూరు(రాజంపేట) : రెండవ విడత నాడు – నేడులో మంజూరైన పది రకాల పనులన్నింటిని సత్వరమే పూర్తిచేయాలని డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి ఆదేశించారు. బుధవారం నాడు – నేడు రెండవ విడతలో ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండవ విడత నిధులు అన్ని పాఠశాలలకు మంజూరైనట్లు వివరించారు. స్కూల్ కమిటీల పర్యవేక్షణలో నాణ్యతగా పనులు చేయాలన్నారు. అన్ని రకాల రికార్డులు, రిజిస్టరులు తప్పక నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజు నాడు – నేడు పనులను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఎంఈఓ గంగిరెడ్డి, ఏఓ రామ్మోహన్‌రెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను జాగ్రత్తగా రూపొందించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీకృష్ణ

చిట్వేలి : ఓటర్ల జాబితాలలో మార్పులు, చేర్పులను జాగ్రత్తగా నిర్వహించాలని తహసీల్దార్ మురళీకృష్ణ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి అధికారి ఆరు రికార్డులను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. గ్రామం నుంచి వెళ్లిపోయిన, మరణించిన వారి పేర్లను జాబితాల నుంచి తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలు నిర్వహించడంలో రాజకీయ ఒత్తిళ్లకు లొంగవద్దన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాల్నినారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

చెత్తను తొలగించిన అటవీ సిబ్బంది



చెత్త, చెదారాలను సేకరిస్తున్న దృశ్యం

సిద్దవటం : సిద్దవటం రేంజిలోని చెత్తాచెదారాలను బుధవారం అటవీ అధికారులు, సిబ్బంది తొలగించారు. రేంజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మిషన్ లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) అనే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ తరపున డీఎఫ్ఓ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు సిద్దవటం చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, చెదారంతో పాటు ప్లాస్టిక్, గాజుపెంకులను సేకరించి ప్రాంతాన్ని శుభ్రంగా చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేసు, సీనియర్ అసిస్టెంటు బాషా, ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, సాబ్‌బావి బేస్ క్యాంపు సిబ్బంది, చెక్‌పోస్టు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

కార్యకర్తలకు సూచించిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న జగనన్న ఆకాంక్షలను ప్రతి ఒక్కరం సైనికుడిగా కృషిచేసి నెరవేర్చాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మందల నాగేంద్ర ఏపీ టూరిజం డైరెక్టర్‌గా, రాఘవరాజుపురం సింగిల్‌విండో అధ్యక్షుడిగా నియమితులైన బలరామయ్యకు జరిగిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, ఆకాంక్షలకు తగ్గట్టు ప్రతి కార్యకర్త, నాయకుడు నియోజకవర్గంలో పనిచేయాలని ఆయన తెలిపారు. పేద బడుగు, బలహీన వర్గాలకు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ నిరంతరం పేద ప్రజల కోసమే కృషి చేస్తున్న వైఎస్ జగన్ వెంటే అందరం నడవాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరిని పార్టీ గౌరవిస్తుందన్నారు. భవిష్యత్‌లో రైల్వేకోడూరును రాయలసీమలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సీఎం జగన్ నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో సహకరిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, జిల్లా కోఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, జెట్పీటీసీ రత్నమ్మ, స్టేట్ డైరెక్టర్స్ గునిశెట్టి ప్రశాంతి, లింగం లక్ష్మీకర్, ముజీబ్, శివాలయం చైర్మన్ సుబ్బరాయుడు, మండల కొండయ్య, కొరెడ్డి సిద్దయ్య, సిహెచ్.రమేష్, అంబటి మురళి, సుబ్రమణ్యం, రత్తయ్య, హరిక్రిష్ణారెడ్డి, బండారు మల్లి, జనార్దన్‌రాజు, ఎస్ఎస్ఆర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

ఓబులవారిపల్లె : మంగంపేట మాజీ సర్పంచ్, సీపీఐ సీనియర్ నాయకుడు చొడవరం శంకరయ్య (80) మృతదేహానికి ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. శంకరయ్య మృతి వివరాలు వారి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు శంకరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రైల్వేకోడూరు సీఐ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జ్యోతి చిన్నయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగా సుబ్బారెడ్డి, సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, వైఎస్సార్ పార్టీ నాయకులు, సీపీఐ నాయకులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మాలల అభ్యున్నతికి పీవీరావు విశేష కృషి



పి.వి. రావుకు నివాళులర్పిస్తున్న దళితనాయకులు

పీలేరు : మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పి.వి. రావు ఆశయాలను కొనసాగిద్దామని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. ధరణికుమార్ అన్నారు. బుధవారం పీలేరులో పి.వి. రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల అభ్యున్నతికి పి.వి. రావు విశేష కృషి చేశారు. నిరంతరం అంబేద్కరిజాన్ని నిలబెట్టడానికి పరితపించిన గొప్ప యోధుడని, కులాల మధ్య అంతరాలను పారద్రోలడానికి ఐఏఎస్ ఉద్యోగాన్ని వదులుకున్నారని తెలిపారు.

విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో పూజలు

పెద్దతిప్పసముద్రం : స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్వాహకులు ననగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవాచకం, దేవనాంది పంచగవ్యము, మహా సంకల్పం, రక్షా స్తోత్రం ధారణ, మహా కుంభ స్థాపన, నవరత్న స్థాపన, అష్ట భంధన కళాకర్షణ కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గోపూజ, శివాలయం ఆవు దూడకు నామకరణ మహోత్సవం , బారసాల కార్యక్రమాలను సంప్రదాయకంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భారతావనికి వెలుగు దివ్వె మహాభారతం

రామాపురం : భారతావనికి వెలుగు దివ్వె మహాభారతమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో జరుగుతున్న పంచమవేదం మహాభారత యజ్ఞంలో బుధవారం శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ధర్మాన్ని, న్యాయాన్ని, సత్యాన్ని ఆచరించినప్పుడే జయం కలుగుతుందని, అంతిమ విజయం ధర్మానిదేనన్నారు. చిన్న పిల్లలు దగ్గర నుండి స్త్రీలు, పురుషులు, వృద్ధులు వరకు ఎవరెవ్వరు ఏఏ సమయంలో ఎలాంటి పనులను చేయాలన్నా నిర్ణయాన్ని అన్ని వర్గాల వారు పాటించాల్సిన ధర్మాలను మహాభారతంలో వివరిస్తుందన్నారు. భారతమాత దాస్య విముక్తి కోసం శంఖారావం చేసిన లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ప్రవచించిన ఖర్మయోగానికి మహాభారతం అందులోని భగవద్గీత కేంద్ర బిందువుగా కనిపిస్తుందన్నారు. మనిషి జీవితంలో ఎదురయ్యే సంఘర్షణలన్నింటికీ మహాభారతం కథలు స్ఫురిస్తాయన్నారు. మండలంలో 2004 సంవత్సరం నుంచి నిర్విరామంగా మహాభారత కార్యక్రమాన్ని నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహణ కమిటీ సభ్యులు ఘనంగా ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ రెడ్డి, సర్పంచ్ అయోధ్యపురం నాగభూషన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భక్తవత్సలం, హరినాథ్, మండల స్టోన్ క్రషర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పాలికొండమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పాలకొండమ్మ



జాతరకు ఊరేగింపుగా వస్తున్న చాందినీబండి

సంబేపల్లె : మండలంలోని ఎస్.సోమవరం పంచాయతీలో ఎంతో ప్రసిద్ధిగాంచిన పాలికొండమ్మ జాతర బుధవారం వైభవంగా ముగిసింది. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు చాందినీబండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఊరేగింపు కార్యక్రమాన్ని చెక్కభజనలు, బ్యాండు మేళాలు, కోలాటాలు, బాణసంచా పేలుళ్ల మధ్య కనుల పండువగా జరిపారు. ఎస్ఐ షరీఫ్, పోలీసు సిబ్బంది ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థులను అభినందించిన కమాండెంట్



విద్యార్థులను అభినందిస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు

సిద్దవటం : ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన బెటాలియన్‌లో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది పిల్లలను కమాండెంట్ శ్రీనివాసరావు బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లో పనిచేస్తున్న పీసీ కె. కిరణ్‌కుమార్ కుమార్తె కె.కీర్తి అక్షయ ఇంటర్మీడియట్ బైపీసీలో (987/1000) మార్కులతో స్టేట్‌లో 2వ ర్యాంకు సాధించిందన్నారు. కె. వి.సుబ్బయ్య కుమార్తె కె. వెంకటసాయి ప్రియాంక 10వ తరగతిలో 592 మార్కులు సాధించారన్నారు. ఈమేరకు బెటాలియన్ కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు విద్యార్థులకు మెమెంటోలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, ఆర్ఐ ఎస్.అలీబాషా పాల్గొన్నారు.

బిందు సేద్యంపై సిబ్బందికి శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఆర్బీకే సిబ్బంది

చిట్వేలి : జిల్లా నీటిపారుదల శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కేఎస్ అగ్రహారం పొలాల్లో బిందు సేద్యంపై ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రిప్ పరికరాల వినియోగం, సస్యరక్షణ, డ్రిప్ ద్వారా ఎరువులు పంపే విధానంపై జిల్లా ఉద్యానశాఖ అధికారి (ఎంఐడీసీ) చంద్రశేఖర్ శిక్షణ ఇచ్చారు. అనంతరం మండల ఉద్యానశాఖ అధికారిణి ఆశియా మాట్లాడుతూ డ్రిప్ ద్వారా ఎరువుల వాడకంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంఐఏఓ సాయి, నజీర్, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రాయచోటి అర్బన్: మాట్లాడుతున్న జయభారత్‌రెడ్డి



సిద్దవటం: ఆటలను ఆడుతున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : పిల్లలు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని రాయచోటి గ్రంథాలయ అధికారి జయభారత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని నిదా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ వేసవి సెలవుల సద్వినియోగంపై దృష్టి సారించాలన్నారు. వేసవి సెలవుల్లో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 45రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో పిల్లలకు కథలు, బొమ్మల తయారీ, మ్యాథ్స్, ఇంగ్లిష్, సైకాలజీలపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ శిబిరానికి పట్టణంలోని అన్ని ప్రాంతాల పిల్లలు హాజరుకావచ్చునన్నారు. కార్యక్రమంలో నిదా పాఠశాల కరస్పాండెంట్ నిస్సార్, టీచర్ ఉషారాణి పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, పలు రకాల ఆటల పోటీలను నిర్వహించారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు పిల్లలను శిబిరానికి పంపాలని ఆమె తెలిపారు.